

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు



సంపుటి : 32 సంచిక : 1 సెప్టెంబరు 2026


రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 20

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు - 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు - 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(నందిగామ శేషసాయి)

పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342


## ఈ సంచికలో. . . .


శ్రీకృష్ణ లీలలు .......................................... 2

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు....... 8

శ్రీమద్భగవద్గీత ......................................... 14


**ఇతర విషయములు :**


చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం




గంగానదిలో స్నానం చేస్తే పాపాలు పోవచ్చు. జ్ఞాని దర్శనం వలన పాపాలే కాదు పాపాలు చేసే బుద్ధి కూడా పోతుంది.

ఓం శ్రీనాన్నపరమాత్మనే నమః

# శ్రీనాన్నగారి చైతన్యస్థితి

(సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి సేకరణ)



**జ్ఞాని యొక్క స్థితి, అంతస్తు ఇంకొక జ్ఞాని మాత్రమే అందుకోగలడు. అయితే మహాత్ములు కరుణతో అప్పుడప్పుడూ వారియొక్క చైతన్యస్థితిని భక్తులకు కొద్దిగా తెరతొలిగించి ఒక మచ్చుతునక చూపిస్తారు. మన గురువు అయిన నాన్నగారు, ఒక తండ్రిగా, ఆత్మీయుడిగా, మన శ్రేయోభి లాషిగా, మనలో ఒకరిగా మెలిగినా, వారి చైతన్యస్థితి వారి మాటలద్వారా, పనుల ద్వారా, వారి జీవనశైలిలో భక్తులకు అందుతూ ఉండేది. 1996లో నాన్నగారికి అంతుపట్టని అనారోగ్యం కారణంగా కొన్ని నెలలపాటు భక్తులకు దూరంగా ఉండి, మళ్లీ వారి జన్మదిన సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో భక్తులతో పంచుకున్న కొన్ని అనుగ్రహ వాక్యాలు...**

దేహానికి కొంత అనారోగ్యం కారణంగా ఈ ఆరు మాసాలు కూడా సమావేశాలు ఆగాయి. ఏదో ఒక సందర్భాన్ని పురస్కరించుకుని భక్తులందరినీ ఒకసారి చూడాలనే ఉద్దేశ్యంతో ఈ సమావేశం ఏర్పాటు చెయ్యటం జరిగింది.

నాకు (నాన్నగారికి) ఆరు మాసాలు నుండి అనారోగ్యం, నా మనస్సు ప్రయాణానికి సిద్ధం అవుతోంది, 104 జ్వరం, జబ్బులో కూడా ఏమి అనిపించటం లేదు. ఏ ధ్యాస

లేదు. పోనీ ఈ జ్వరం తగ్గితే అరుణాచలం వెళ్ళి గిరి ప్రదక్షిణ చేసొద్దాం అని కూడా నాకు అనిపించటం లేదు. ఒక రోజున శరీరం లేని ఏదో ఒక శక్తి కనపడింది. అంటే రూపం లేదు. శరీరం కనిపించటం లేదు కానీ వాయిస్ వస్తోంది అన్నమాట. అలా వచ్చి ఉడిపి పేరు ఎప్పుడైనా విన్నావా అని అడిగింది. ఉడిపి కర్ణాటక రాష్ట్రంలో ఉంది అని చెప్పాను. అక్కడ ఉన్న దేవుడు ఎవరో నీకు తెలుసా? ఉడిపిలో ఉన్నది బాలకృష్ణుడు. ఆయన అడుగుతున్నాడు నా చేత సమాధానం చెప్పిస్తున్నాడు అన్నమాట. అది ఎవరు స్థాపించారో నీకు తెలుసా? మధ్వాచార్యుల వారు స్థాపించారు. 'బాలకృష్ణుడిని ఒకసారి వెళ్ళి దర్శనం చేసి వస్తాను' అని నువ్వు అనుకో నీకు జ్వరం తగ్గిపోతుంది అని వాయిస్ వినపడింది. ఇది అంతా మీకు ఎందుకు చెబుతున్నాను అంటే ఉడిపి వెళ్ళాలి అని కానీ, కృష్ణుడిని దర్శించాలి అని కానీ, జాగ్రదవస్థలోకి వచ్చాక కూడా మనసుకి నాకు సంకల్పం రాలేదు. నేను డాక్టరుగారితో రాత్రి ఇలా స్వప్నం వచ్చింది కృష్ణుడిని దర్శించమని అని చెప్పాను. డాక్టరు గారు వెంటనే మీరు మొక్కుకోండి అన్నారు. ఎందుచేత అంటే మీకు జ్వరం ఎందుకు వస్తోందో మాకు అర్థం కావటం లేదు. మీరు ఆరోజుకారోజు మనిషి నీరస పడిపోతున్నారు. జ్వరానికి కారణం ఏమిటో మాకు తెలియటం లేదు. ఇది మాకు చేతనవ్వని పని, అందుచేత మీరు మొక్కుకోండి అని చెప్పారు. ఆయన చెప్పింది రైటే! కానీ మొక్కుకోవాలి అని మనసులో ఎంత ప్రయత్నం చేసినా అది రాలేదు, అప్పుడు రాలేదు, ఇప్పుడు రావట్లేదు. అంటే ఉడుపి వెళ్ళకూడదు అని కాదు, కృష్ణుడిని చూడకూడదు అని కాదు. జ్వరం తగ్గిపోతే గిరి ప్రదక్షిణ చేద్దామని కూడా నాకు అనిపించలేదు. నేను ఉడిపి వెళ్ళవచ్చు, కృష్ణుడిని చూడవచ్చు లేకపోతే తిరుపతి వెళ్ళవచ్చు, వెంకటేశ్వరస్వామిని చూడవచ్చు, అది వేరే విషయం. కానీ మొక్కుకుందాం అనే భావన మటుకి నాకు రాలేదు. స్వప్నమే కదా అనిపించింది నాకు. నేను చచ్చిపోతానా? ఏముంది దీంట్లో, సెంటు పర్సెంటు ప్రిపేర్ అయిపోయి ఉన్నాం కదా అనిపించింది.

ఇవి పంచభూతాలు. మనలో ఉన్న ప్రాణశక్తే పంచభూతాల పోగుని నిలబెట్టి

ఉంచింది. దేహప్రారబ్దం ఖర్చుఅయ్యేవరకు ఈ ప్రాణం అలా దేహాన్ని అంటిపెట్టుకుని ఉంటుంది. దేహప్రారబ్ధం అలా పూర్తిఅయ్యేటప్పటికి ఈ దేహాన్ని ప్రాణం విడిచిపెట్టేస్తుంది. అదే చచ్చిపోవడం అంటారు. అంతకంటే ఏమీ లేదు. మరణించటం అంటే అదే. మనలో ఉన్న అజ్ఞానం పోనప్పుడు వంద సంవత్సరాలు జీవిస్తే మటుకు ఏముంది? ఒకొక్క దేహంలో ఎంత సాధన చేసినా అజ్ఞానం పోదు. అప్పుడు సడన్‌గా ఈశ్వరుడు ట్రాన్స్‌ఫర్ చేసేయవచ్చు. ఏమో ఈశ్వరుడి ప్రణాళిక ఎలా ఉందో. Thy Will be done!

ఇంతకీ ఇక్కడ మనం చెప్పుకునే మాటలు ఏమిటంటే, సర్వసాధారణంగా దేవాలయంలోకి వెళ్ళినా, జ్ఞాని దగ్గరకి వెళ్ళినా, భక్తులు కూడా లోకానికి సంబంధించిన ప్రయోజనాలు ఆశించి వెళతారు. రమణస్వామి దగ్గరకి చాలామంది లౌకిక మనుషులు లోకానికి సంబంధించిన కోరికల తోటే వెళ్ళేవారు. ఆయన వీళ్ళ వంక చూసేవాడు. ఆ దేహ ప్రారబ్ధాన్ని బట్టి వాళ్ళ కోరికలు నెరవేరవచ్చు, నెరవేరక పోవచ్చు. ఏదైనా స్వప్నమే అది. వీళ్ళకి ఏది మంచిదో గురువుకి తెలుసు గాని, వీళ్ళకి తెలియదు. వేదాంత సాంప్రదాయంలో మూడు దీక్షలు ఉన్నాయి. ఒకటి చక్షు దీక్ష. పవిత్రమైన హృదయం గలవాడు ఒకసారి మన వంక చూస్తే చాలు. నిజమైన గురువు, ఆ ఈశ్వరుడే, ఆత్మే మానవరూపం ధరించి వస్తే, మానవజాతిని అపూర్వంగా, అమోఘంగా, ఉదాత్తంగా ప్రేమిస్తున్న గురువే కనుక అయితే, ఒక్క చూపుతో శిష్యుడి యొక్క మనస్సుని ఆత్మవైపుకి గురిపెట్టేలాగా చేస్తాడు. నువ్వు ఏ ఉద్దేశ్యంతో, ఏ సంకల్పంతో వెళ్లినా, ఈ లోకానికి సంబంధించి కాని, పరలోకానికి సంబంధించి కాని ఏ ప్రయోజనం నిమిత్తం, ఏ కోరిక నిమిత్తం గురువు దగ్గరకి వెళ్ళినా, నీ మనసుని ఎక్కడ గురి పెట్టాలో, అక్కడ గురి పెట్టేలాగా చూస్తాడు, నీ దృష్టి ఆత్మ వైపు తిప్పుతాడు. నిజమైన గురువు ఒక్కసారి మీ వంక చూస్తే, ఈ అజ్ఞానం అనే గడ్డి మేటుకి అగ్గిపుల్ల వెలిగించినట్టే. అటువంటి చూపు చూస్తాడు. గురువు అంటే ఈశ్వరుడు.

**ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః**

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 19 ఏప్రియల్ 1996, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

పునర్జన్మ ఎలా వస్తుంది అని భగవాన్‌ను అడుగుతున్నారు. భగవాన్ ఏమని చెప్పారంటే ఇప్పుడు నువ్వు ఎలా పుట్టావో రాబోయే జన్మల్లో కూడా అలాగే పుడతావు. కాని ఇది మటుకు ultimate truth కాదు. ఇవి అన్నీ వ్యవహారిక సత్యాలు. ఈ పుట్టటాలు, చావటాలు, పుణ్యాలు, పాపాలు, లాభాలు, నష్టాలు ఇవి అన్నీ కూడా మనస్సు ఎంత నిజమో అవి కూడా అంతే నిజం. ఇవి అన్నీ వ్యవహారిక సత్యాలు. లోకం కూడా వ్యవహారిక సత్యమే, పారమార్థిక సత్యం కాదు. ఎవడికైతే బ్రహ్మానుభవం కలిగిందో వాడికి ఇంక లోకం లేదు. The sage is bodyless, the sage is mindless, the sage is worldless. బ్రహ్మానుభవం పొందినవాడు దేహంలో ఉన్నా లేనివాడితో సమానమే, వాడు లోకంలో ఉన్నా లేనివాడితో సమానమే. వాడు మనస్సుచేత బంధింపబడడు. ఎందుచేత అంటే అది కాలిపోయిన తాడు వంటిది. కాలిపోయిన తాడు రూపానికి తాడు కింద కనిపించినా అది దేనినీ బంధించదు. అలాగే జ్ఞానికి మనస్సు ఉన్నప్పటికీ ఆ మనస్సుచేత వాడు బంధింపబడడు. వాడు దేహంలో ఉన్నా లేనివాడితో సమానమే. వాడు మనల్ని గుర్తిస్తున్నా, మీరు ఎప్పుడు వచ్చారు, ఎలా ఉన్నారు అని మనలను అడుగుతున్నా వాడు మనస్సు లేని వాడితో సమానమే.

Are you born now? ఇప్పుడు నువ్వు పుట్టావా అంటున్నారు భగవాన్. మీ గురువులు ఎవరైనా, మీరు ఏ మతంలో ఉన్నా, మీరు ఏ కులంలో ఉన్నా నేను పుట్టాను అని అనుకొన్నవాడికి ఎవడికీ మోక్షం రాదు అని భగవాన్ చెప్పారు. ఇప్పుడు మనం అందరం పుట్టాము అని అనుకొంటున్నామా? లేదా? పుట్టాము అని అనుకొంటున్నాము. అంటే ఇంక మనకు మోక్షం వచ్చే సమస్య లేదు. ఎవరు పుడతారు? దేహం పుడుతుంది. ఎవరు పెరుగుతారు? దేహం పెరుగుతుంది. ఎవరు చనిపోతారు? దేహం చనిపోతుంది. అంటే నీకు దేహబుద్ధి ఉంది కాబట్టి దేహం పుట్టినప్పుడు నేను పుట్టాను అనుకొంటున్నావు. నీకు ఆత్మబుద్ధి కనుక కలిగితే ఆత్మకి పుట్టుకలేదు కాబట్టి నాకు పుట్టుక లేదు అన్న సంగతి నీకు తెలుస్తుంది.

అవ్యయ, అభవ, పూర్ణ, చిత్‌సుఖం. ఏమి సుఖం అంటే పుట్టని సుఖాన్ని పొందు. దేహం పుట్టింది, ఆ దేహానికి ఇంద్రియాలు ఉంటాయి. వాటి వల్ల వచ్చే సుఖాన్ని నువ్వు పొందుతున్నావు. ఇది సుఖం కింద నీకు కనిపిస్తుంది కాని పరిణామంలో వడ్డీతో సహా దుఃఖాన్ని తీసుకొనివస్తుంది. నువ్వు పొందవలసింది ఈ సుఖాన్ని కాదు, పుట్టని సుఖాన్ని పొందు. ఏది పుట్టలేదు? ఆత్మ పుట్టలేదు. ఆత్మలో సుఖం ఉంది, ఆ సుఖాన్ని పొందు. పూర్ణసుఖం, వెలితిలేని సుఖం, వ్యయం కానటువంటి సుఖం, ఎంత అనుభవించినా వెగటు పుట్టించని సుఖం, పుట్టుకలేని సుఖం ఆత్మలో ఉంది కాబట్టి ఆ సుఖం వైపు నువ్వు కళ్ళు తెరువు. ఇప్పుడు నువ్వు పుట్టావా అని ప్రశ్నించేవాడిని అడుగుతున్నారు ""ఇప్పుడు నువ్వు పుడితే రాబోయే జన్మల గురించి నువ్వు నన్ను అడగచ్చు, నేను నీకు చెప్పచ్చు, ఇప్పుడే నీకు పుట్టుక లేదు, ఇప్పుడు నువ్వు పుట్టలేదు. జన్మే లేనప్పుడు పునర్జన్మ ఏమిటి? దేహం పుట్టింది, నువ్వు పుట్టలేదు, నువ్వు ఆత్మవి, రాబోయే జన్మల గొడవలు అన్నీ మన మనసులో ఉన్నాయి. పూర్వ జన్మల గొడవలు అన్నీ మన మనసులో ఉన్నాయి, ఏవండీ నేను చచ్చిపోయిన తరువాత ఎక్కడ పుడతాను అని ఇప్పుడు అడుగుతాడు మనిషి, కానీ గాఢనిద్రలో ఎవడైనా అడుగుతాడా? అడగడు. ఎందుచేత అంటే మనసు లేదక్కడ, గాఢనిద్రలో మైండ్ అణిగిపోయినప్పుడు ఇంక పూర్వ జన్మల గొడవ ఉండదు, రాబోయే జన్మల గొడవ ఉండదు.

భగవాన్ దగ్గరకి వచ్చి ఒక పెద్దమనిషి ఏమని చెప్పాడు అంటే నాకు పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించేసుకున్నాను అన్నాడు. భగవాన్ ఏమన్నారు అంటే నీకు పిల్లలు పుట్టకుండా నువ్వు ఆపరేషన్ చేయించుకున్నావు. నువ్వు తిరిగి పుట్టకుండా ఆపరేషన్ చేయించుకో అన్నారు. అంటే దేహం పుట్టింది, దేహం నేను అనుకుంటున్నావు కాబట్టి నేను పుట్టాను అనుకుంటున్నావు. ఆ దేహం తోటి identify అవుతున్నావు. ఇప్పుడు నరకాసురుడు ఎవడంటే "I am the body" idea. "I am the body" thought, అదే నరకాసురుడు. దేహం నువ్వు అనుకుంటున్నావు కాబట్టి, దానితోటి తాదాత్మ్యం పొందుతున్నావు కాబట్టి, దేహం పుట్టినప్పుడు నేను పుట్టాను అనుకుంటున్నావు. దేహం చనిపోయినప్పుడు నేను చనిపోయాను అనుకుంటున్నావు. దేహం పుట్టినప్పుడు మనిషి పుట్టలేదు, భగవాన్ చెబుతున్నారు. మనిషి ఎప్పుడు పుట్టాడు? నేను అనే

తలంపు ఎప్పుడైతే పుట్టిందో, అప్పుడు పుట్టాడు

నిజం చెప్పాలంటే, ఉన్నది ఉన్నట్టుగా నీకు చెప్పాలంటే, చావు లేదు, పుట్టుక లేదు. ఆత్మకి చావు లేదు, పుట్టుక లేదు. అది ఎవరు? అది నువ్వే. పునర్జన్మ కూడా నిజం కాదు. నిజం అల్లా ఆత్మ ఒక్కటే, అది ఎవరు అనుకుంటున్నావు? అది నీవే. ఇక్కడ మనం కళ్లు తెరవాలి, ఇక్కడ మేల్కోవాలి. సంసారం అంటే మీ ఇంట్లో ఉన్న మనుషులు కాదు. నేను చచ్చిపోయాను అనుకోవడం, నేను పుట్టాను అనుకోవడమే సంసారం. అందుచేత పుట్టుక లేనిది ఏది? ఆత్మ. దానికి పుట్టుక లేదు కాబట్టి చావనేచావదు. పుట్టిన వస్తువు చనిపోతుంది కానీ పుట్టుక లేని వస్తువుకి చావు లేదు. పైగా అది ఎవరు? నీవే. అది నీకు అనుభవంలోకి వచ్చినప్పుడు, నువ్వు ఇంతవరకు ఎత్తిన వేలాది జన్మలు అన్నీ కూడా స్వప్నం మాత్రమే అన్న సంగతి నీకు తెలుస్తుంది. అంటే మనకి స్వప్నంలో కనిపించిన దేహాలు అన్నీ ఎంత నిజమో, waking స్టేట్ లో కనిపించే దేహాలు అన్నీ కూడా అంతే నిజం అన్న సంగతి నీకు తెలుస్తుంది.

భగవాన్ ఏమంటున్నారు అంటే రాబోయే జన్మల గురించి నువ్వు ఆలోచిస్తున్నావు, ఎవరైతే పుట్టారో వాడిని ఆలోచించమను నువ్వు పుట్టలేదు కదా అంటున్నారు. రాబోయే జన్మల గురించి వీడు ప్రశ్నలు అడుగుతున్నాడు. పుట్టినవాడు చావు గురించి ఆలోచించు కుంటాడు, అలా ఎవడైతే పుట్టాడో వాడిని ఆలోచించుకోనివ్వు. నీకు ఎందుకు నువ్వు పుట్టలేదు కదా, నువ్వు ఆత్మవి కదా అంటున్నారు భగవాన్, అది ఇక్కడ లాజిక్. You are neither this mind nor this body, immortal self you are. You are brahmam, you are the truth, అంటే మీలో ఎంతమందికి అందుతుంది? ఏ వస్తువుని మీరు తెలుసుకోవాలి అనుకుంటున్నారో అది మీరే, పునర్జన్మలు గురించి నువ్వు ఆలోచిస్తున్నావు. నిన్ను ఆలోచించవద్దు అని నేను అనడం లేదు, ఎవడైతే పుట్టాడో వాడిని ఆలోచించుకోనివ్వు. నువ్వు పుట్టలేదు కదా, నీకు ఎందుకు అంటున్నారు. నీ హృదయంలో ఉన్న వస్తువు ఉన్నది ఉన్నట్టుగా నీకు వ్యక్తం అయితే నువ్వు నిగ్రహించుకోవడానికి ఇంక నీకు జీవుడు కానీ, మనసు కానీ లేనే లేవు. పునర్జన్మలు లేవు, చావులు లేవు, పుట్టుకలు లేవు. నువ్వు ఎవరవో నీకు తెలిసినప్పుడు ఇంక సాధన చెయ్యడానికి, పూజలు చెయ్యడానికి, జపాలు చెయ్యడానికి,

ధ్యానాలు చెయ్యడానికి అక్కడ ఎవడూ లేడు నీకు, అంటే మీకు జపాలు చెయ్యాలని సరదాగా ఉంది అనుకోండి, జ్ఞానం వచ్చేసింది అనుకోండి, ఆ జపం చేసే జపే లేకుండా పోతాడు. ఇంక మీరు జపం దేనితోటి చేస్తారు? అందుచేత రాబోయే జన్మల గురించి ఎవడైతే పుట్టాడో వాడిని ఆలోచించుకోమను, ఆ గొడవ నీకు ఎందుకు? పుట్టినవాడు ఆలోచించుకుంటాడు. నీకు ఎందుకు, అది నువ్వు కాదు కదా అంటున్నారు భగవాన్.

భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే “మీ హృదయంలో ఒక నిజం ఉంది, ఆ నిజాన్ని నువ్వు అనుభవంలోకి తెచ్చుకోవడమే మీ జీవిత గమ్యం. అంటే నిజాన్ని నువ్వు నేనుగా వ్యక్తం చేసుకోవాలి. నీ చేత చూడబడేది ఏది కూడా నిజం కాదు. నిజం అనేది చూడబడే స్థితిలో లేదు, చూసే స్థితిలో ఉంది. అది నీ హృదయంలో స్పష్టంగా, స్వచ్ఛంగా ఉంది. అంటే మనం అందరం ఇక్కడ కూర్చోవడం వ్యవహారిక సత్యమే కానీ నీ హృదయంలో ఉన్న నిజం మటుకు వ్యవహారిక సత్యం కాదు అది పారమార్థిక సత్యం, అది ultimate ట్రూత్.

నీ హృదయంలో ఉన్న నిజాన్ని నువ్వు తెలుసుకోవడం కోసం దానికి సంబంధించిన సామాగ్రి నువ్వు సంపాదించుకో, దానికి సంబంధించిన సామాగ్రి నువ్వు సంపాదించుకున్న తరువాత కూడా దానిని తెలుసుకోవడం మానేసి, ఈ సామాగ్రి పోగు చేసుకోవడమే నువ్వు పనిగా పెట్టుకుంటే అది సాధన కాదు luxury అన్నారు. మీకు అర్థం అవుతోందా? ఎంతవరకు నువ్వు విషయం తెలుసుకోవాలో అంతవరకు తెలుసుకో, అది luxury కాదు. మీకు పది చీరలు అవసరం అనుకోండి సంవత్సరానికి, పది చీరలు ఉండడం luxury కాదు, వంద చీరలు మీ ఇంట్లో పెట్టుకుంటే అది luxury. అదేవిధంగా మీ హృదయంలో ఉన్న నిజం తెలుసుకోవడానికి కొంత knowledge నీకు అవసరమే. ఆ knowledge నువ్వు సేకరించాక నీ హృదయంలో ఉన్న నిజం తెలుసుకోవడం మానేసి, ఇంకా knowledge బ్రెయిన్‌లో లోడ్ చేసుకోవడానికి నువ్వు ప్రయత్నం చేస్తే, దానిని సాధన అనరు, luxury అంటారు అన్నారు భగవాన్. భగవాన్ చెప్పేది ఏమిటంటే truth ఇక్కడే ఉంది, ఇప్పుడే ఉంది. మీరు truthని కనుక ప్రాక్టీస్ చేస్తుంటే, మీ అంతట మీకు రివీల్ అయిపోతుంది. దేనినైతే పోగొట్టుకోవాలో అది ఇల్లు విడిచి పెట్టేసినంత మాత్రం చేత అది పోదు. నువ్వు ఎక్కడకి వెళ్ళినా కూడా

వచ్చేస్తుంది. కాశీ వెళితే కాశీ కూడా వచ్చేస్తుంది, ఒకవేళ నువ్వు ఏదైనా బలవంతంగా మరణించావు అనుకో, శరీరం చచ్చిపోయినా అది నీ కూడా వచ్చేస్తుంది. టైముకి కాఫీ తాగి, టైముకి భోజనం చేసి, అన్ని comforts ఉండగానే అహంకారాన్ని నువ్వు పోగొట్టుకో లేనప్పుడు, comforts ఏమి లేనప్పుడు ఆ అహంకారాన్ని నువ్వు ఎలా పోగొట్టుకుంటావు . ఎక్కడికో వెళ్ళిపోతావు అనుకో నువ్వు హిమాలయ పర్వతాలకి వెళ్ళినా నీ కూడా నీ మైండ్ వచ్చేస్తుంది. నువ్వు హిమాలయ పర్వతాలలో, టైముకి కాఫీ లేకుండా, టైముకి భోజనం లేకుండా చలిలో బాధపడి, ఇంటివద్దే నువ్వు నిగ్రహించలేనప్పుడు అక్కడ నిగ్రహిస్తావు అని గ్యారంటీ ఏమి ఉంది? ఈరోజు చెయ్యలేని పని రేపు చేస్తావు అని గ్యారంటీ ఎక్కడ ఉంది? రేపుకి రూపు లేదు. నువ్వు ఈ జన్మలో చెయ్యలేని పని వచ్చేజన్మలో చేస్తావు అని ఎక్కడుంది? అందుచేత వర్తమాన కాలాన్ని సద్వినియోగం చేసుకో, రేపు రేపు అనుకోకు, మీకు అన్ని అవకాశాలు ఉన్నప్పుడే అభివృద్ధి చెందడానికి ప్రయత్నం చెయ్యనప్పుడు అవకాశాలు లేనప్పుడు ఎలా చేస్తావు? చెయ్యలేవు.

నువ్వు గృహంలో ఉండాలంటే ఉండు, గృహ పరిత్యాగం చెయ్యాలంటే చెయ్యి, కానీ ఇక్కడ అది ముఖ్యం కాదు, నువ్వు గృహంలో ఉన్నావా? గృహ పరిత్యాగం చేశావా అన్నది ముఖ్యం కాదు. నువ్వు గృహంలో ఉన్నా, గృహ పరిత్యాగం చేసినా, దేన్ని పోగొట్టుకోవాలో దాన్ని పోగొట్టుకుంటే నీకు సత్యం తెలుస్తుంది. ఇది బాగా అర్థం చేసుకోండి. మీరు గృహంలో ఉన్నా ఇబ్బంది లేదు, గృహం విడిచిపెట్టి బయటకి వెళ్ళిపోయినా ఇబ్బంది లేదు. కానీ గృహంలో ఉన్నా, గృహం విడిచిపెట్టి బయటకి వెళ్ళిపోయినా పోగొట్టుకోవలసింది ఒక్కటే, అహంభావనని పోగొట్టుకోవాలి. ఆధ్యాత్మిక అభివృద్ధికి మీ ఇల్లు అడ్డు రావడం లేదు, అడవి అడ్డు రావడం లేదు. మీకు అర్థం అవుతోందా? ఇంట్లో మనుషులు ఉంటారు, అడవిలో జంతువులు ఉంటాయి. ఊరికే పరిసరాలు తేడా, కానీ నువ్వు పోగొట్టుకో వలసింది ఇంట్లో ఉన్నా, అడవిలోకి వెళ్ళినా అదే అహంభావనని పోగొట్టుకోవాలి. అందుచేత నువ్వు ఇంట్లో ఉండి పోగొట్టుకోలేనిది అడవిలోకి వెళ్లి పోగొట్టుకోవడానికి ఏమైనా అవకాశం ఉందా? పోగొట్టుకోగలను అని గ్యారంటీ ఏమైనా ఇవ్వగలవా నువ్వు? ఒకవేళ నీ మనస్సే

నిన్ను అలా మాయ చేస్తుందేమో!

కొంతమంది ఇంట్లో వాళ్ళ మీద కోపం వచ్చి కాశీ వెళ్ళిపోతారు. దేవుడిని తెలుసుకోవడానికి వాడు కాశీ వెళ్ళాడో, ఇంట్లో వాళ్ళ మీద కోపం వచ్చి కాశీ వెళ్ళిపోయాడో తెలియకుండా ఉంటాడా దేవుడు? దేవుడు మనకంటే తెలివైనవాడే కదా, ఈ మాత్రం తెలియకుండా ఉంటాడా? నువ్వు ఏ పని చేసినా నువ్వు చేసే పని చూడడు దేవుడు, నీ తలంపు చూస్తాడు, తలంపుని బట్టి మాట ఉంటుంది, తలంపుని బట్టి పని ఉంటుంది, నువ్వు ఏదైతే పోగొట్టుకోవాలి అనుకుంటున్నావో ఇల్లు విడిచి పెట్టి వెళ్ళిపోతే అది అక్కడే ఉండిపోతుంది అనుకుంటున్నావేమో అది నీ కూడా హిమాలయ పర్వతాలకి వచ్చేస్తుంది అంటున్నారు భగవాన్. నువ్వు ఏదైతే పోగొట్టుకోవాలో అది నీకూడా ఉంటూనే ఉంటుంది.

నీ అహంభావనే ఈ దేహం నాదని చెబుతుంది. ఈ ప్రపంచాన్ని కల్పించినది కూడా నీ అహంభావనే కల్పించింది. నేను ఈ దేహంలో ఉన్నాను అనిచెప్పేది కూడా నీ అహంభావనే. ఇదంతా నీ అహంభావనే చేస్తుంది. నేను గృహస్థుడను, నేను గృహస్థుడను అని ఆత్మ చెప్పడం లేదు అహంభావనే చెబుతుంది. నేను సన్యాసిని, నేను సన్యాసిని అని ఆత్మ చెప్పడం లేదు, అహంభావన చెబుతుంది. నువ్వు ఏదైతే పోగొట్టుకోవాలి అనుకుంటున్నావో అది నీ కూడానే ఉంటుంది. అదే దేహాన్ని కల్పిస్తుంది, గృహస్థాశ్రమాన్ని కల్పించేది అదే, సన్యాసాశ్రమాన్ని కల్పించేది అదే, ఏదైతే నువ్వు పోగొట్టుకోవాలో అదే ఈ



**మీరు ఇప్పుడే, ఇక్కడే తరించాలంటే రోజూ మీరు చేసే ప్రతీ పనిని అహంభావన లేకుండా చేయండి. అవసరం అనిపిస్తే పనిచేయండి, అహంభావన కోసం పని చేయవద్దు.**

గొడవలు అన్నీ కల్పిస్తుంది.

రాజకీయ పార్టీలు జనాన్ని ఎలా పోగు చేసుకుంటున్నారో, అలా గురువు కూడా పదిమంది జనాన్ని పోగు చేసుకుని మీరు అందరూ నా శిష్యులు, నేను మీకు గురువుని అంటాడు అనుకోండి, మామూలుగా వ్యవహారానికి వీడు గురువు అనుకోవచ్చు, వాడు శిష్యుడు అనుకోవచ్చు, అలా ఒక మనిషి పదిమంది చేత గురువు అనిపించుకున్నంత మాత్రం చేత వాడికి మోక్షం రాదు, మాయ ఎంత బలీయమైనదో చూడండి, ఇంటి దగ్గర ఉన్నంతసేపు నేను గృహస్థుడను, నేను గృహస్థుడను అనుకుంటాడు. ఎవడో గురువు దగ్గరకి వెళ్ళిపోతాడు, తెల్లబట్టలు విడిచి పెట్టేసి ఎఱ్ఱ బట్టలు వేసుకుంటాడు. నేను సన్యాసిని, నేను సన్యాసిని అనుకుంటాడు. అప్పుడు ఆత్మ భావన ఉండదు, ఇప్పుడు ఆత్మ భావన ఉండదు, అదీ మాయే, ఇదీ మాయే అన్నారు. మీరు ఫాలో అవుతున్నారా? గురువు దగ్గరకి వెళ్లి సన్యాసం తీసుకున్నప్పుడు నేను సన్యాసిని అనుకుంటున్నాడు, అదొక తలంపు. ఇంటిదగ్గర నేను గృహస్థుడని అనుకుంటున్నాడు, ఇదొక తలంపు. ఆత్మ భావన ఇక్కడా లేదు, అక్కడా లేదు. ఇక్కడ గృహస్థుడను అనుకుంటున్నాడు, అక్కడ నేను సన్యాసిని అనుకుంటున్నాడు. సుబ్బారాయుడు సుబ్బరాయుడిగానే ఉంటున్నాడు, వాడికి జ్ఞానం సున్నా అంటున్నారు. తలంపు మారింది అంతే!

అందుచేత నువ్వు ఏమి చెయ్యాలి అంటే, నువ్వు సన్యాసం పుచ్చుకున్నా, గృహస్థాశ్రమంలో ఉన్నా, నీకు బ్రహ్మానుభవం కలగడానికి ఏవైతే ఆటంకాలు ఉన్నాయో ఆ ఆటంకాలని తొలగించుకోవాలి. ఒకవేళ నువ్వు గృహస్థాశ్రమంలో ఉండి తొలగించుకున్నావు అనుకో, నీకు బ్రహ్మానుభవం వచ్చేస్తుంది. ఇది బాగా అర్థం చేసుకోండి. ఏవో పరిసరాలు మార్చేస్తావు అనుకో, ఆ కొత్త పరిసరాలు నీ ఆధ్యాత్మిక అభివృద్ధికి సహకరిస్తాయి అని చెప్పలేము. పరిసరాలు మారినంత మాత్రం చేత నీకు జ్ఞానం వచ్చేయదు. బట్టలు మార్చినంత మాత్రం చేత నీకు జ్ఞానం వచ్చేయదు. నీకు ఆటంకం అల్లా నీ అహంభావనే. నువ్వు ఏ ఆశ్రమంలో ఉన్నా తొలగించుకోవల్సింది అదే, ఏ పరిసరంలో ఉన్నా తొలగించుకోవల్సింది అదే.

ఇంతకీ భగవాన్ చెప్పేది ఏమిటి అంటే మనం కాషాయం బట్టలు కట్టుకుంటే సాధన బాగుంటుందేమో, లేకపోతే ఇక్కడ నుంచి రామేశ్వరం వెళ్ళిపోతే సాధన బాగుంటుందేమో, ఎంతసేపు 24 గంటలు మైండ్ ఇలా ఆలోచిస్తుంది కానీ, ఈ అహంభావనని తొలగించడానికి అది ప్రయత్నం చెయ్యదు, గృహస్థాశ్రమం కంటే సన్యాసాశ్రమం బాగుంటుందేమో, సన్యాసాశ్రమం కంటే గృహస్థాశ్రమం బాగుంటుందేమో, పూరీ జగన్నాథంలో సముద్రం ఉంది అందుచేత కాశీ కంటే పూరీ బాగుంటుందేమో, ఇలా ఆలోచించమంటే ఆలోచిస్తుంది కానీ తనని తాను తొలగించుకోవడానికి అది ఇష్టపడదు, ఇదే మాయ. మాయ అంతా ఎక్కడ ఉంది? మనసులో ఉంది. భగవాన్ ఏమని చెప్పారు అంటే నీకు జ్ఞానం కావాలి అంటే, మీరు చుట్టాలు ఇంటిదగ్గర ఎలా ఉంటారో అలా ఉండకండి, మీ ఇంటిదగ్గర ఎలా ఉంటారో అలా ఉండండి మీకు జ్ఞానం వచ్చేస్తుంది అంటున్నారు. చుట్టాల ఇంటికెళ్ళినప్పుడు మనం artificial గా ఉంటాం కదా, మన ఇంటి దగ్గర మనం ఉన్నప్పుడు artificial గా ఉండము. మనం normalగానే ఉంటాం, Natural గానే ఉంటాం. అదేవిధంగా నీ మైండ్ కూడా అంత natural గా, అంత నార్మల్‌గా మీ హృదయంలో కనుక ఉంటే మనసు కరిగిపోతుంది. మనసు ఎప్పుడైతే కరిగిపోయిందో అప్పుడు హృదయంలో ఉన్నటువంటి సద్వస్తువు నీకు నేనుగా వ్యక్తం అవుతుంది. అది చివరిస్థితి, అది పరమస్థితి.


## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**సంవత్సర చందా రు॥ 150/-లు.**

**శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు.**

రమణ భాస్కర చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము. మీ చందాను స్వయంగా గానీ లేక **శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యడ్ల బజార్, పాలకొల్లు బ్రాంచి** అకౌంట్ నెంబర్ **520101264185724 (IFSC Code : UBIN0827533)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# సద్గురు నాన్నగారితో స్వర్గీయ రాజేశ్వరిగారి అనుబంధం

**హైదరాబాద్ వాస్తవ్యులు స్వర్గీయ రాజేశ్వరిగారు శ్రీనాన్నగారి పట్ల సంపూర్ణ భక్తివిశ్వాసాలతో జీవించారు. వారి కుమారుడు డా. ఉదయ్ కిరణ్, కుమార్తె శిరీష కూడా చిన్నతనము నుంచి నాన్నగారి పట్ల భక్తివిశ్వాసాలు కలిగి సదా నాన్నగారి జ్ఞాపకాలలో ఉంటారు.**

**శ్రీనాన్నగారితో రాజేశ్వరిగారి అనుభవాలు వారి మాటలలో...**

నాన్నగారు మన జీవితంలోకి వచ్చాక ఒక్కసారి వెనుకకు తిరిగి చూసుకుంటే జీవితం అంతా నాన్నగారే ఉంటారు. మన భౌతిక జీవితం మరియు ఆధ్యాత్మిక జీవితం ఆయన ఆధీనంలోకి వెళ్ళిపోతాయి. మనల్ని ప్రేమగా సవరిస్తూ, శాంతిలో నిలబెడుతూ మన ఆధ్యాత్మిక ప్రయాణాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు.

నా ఆధ్యాత్మిక ప్రయాణం మా అమ్మగారి ద్వారానే మొదలైంది. అరుణాచలంలో రమణాశ్రమాన్ని దర్శించుకోమని ఆవిడ చెపితే నా భర్తతో వెళ్ళాను. రమణాశ్రమం గేటుచూడగానే, నాకు తెలియకుండానే దుఃఖం వచ్చేసింది. అది పూర్వజన్మ అనుబంధం అని నాన్నగారి దగ్గరకు వచ్చాక అర్థమయ్యింది. తరువాత రెండు సంవత్సరాలకి నా భర్త అకస్మాత్తుగా చనిపోయారు. ఎందుకో తెలియదు కానీ, నాకు కలగవలసినంత దుఃఖం కలుగలేదు. భగవంతుడు దగ్గర మాత్రమే నాకు తెలియకుండా కన్నీరు వచ్చేసేది. ఏదో ఒక ఆధ్యాత్మిక సంస్థని పట్టుకొని ఉండాలనిపించి, అవకాశం ఉన్నప్పుడల్లా పుస్తకాలు చదివి, చాలా ఆధ్యాత్మిక కేంద్రాల చుట్టూ తిరిగాను.

నా భర్త చనిపోయిన సంవత్సరానికి మా కుటుంబమంతా అరుణాచలం వెళ్ళాము. అక్కడ, గోలక్ష్మి తన సంతానాన్ని భగవాన్‌కి అప్పచెప్పినట్టు, అరుణగిరిని చూస్తూ 'నాబిడ్డల భారం నీదే, నేను తల్లి వేషం వేస్తాను, నువ్వే చూసుకో' అని అప్పగించేసాను. అరుణాచలం నుండి వచ్చేస్తుంటే ఎప్పటినుండో నాలో దాగి వున్న దుఃఖం కట్టలు తెంచుకుంది. గిరివైపు చూస్తుంటే, తల్లిదండ్రులు కూతురుని అత్తవారింటికి కన్నీటితో సాగనంపినట్లు గిరికూడా నన్ను సాగనంపుతున్నట్టు అనిపించింది. 'తండ్రీ! నువ్వు నాకు చాలాదూరంగా ఉన్నావు, ఎలా నీ దగ్గరికి రాగలను' అంటూ దుఃఖపడుతున్న సమయంలో మా అమ్మగారు రమణమహర్షిగారి శిష్యులు ఒకరు 'నాన్నగారు' అని ఉన్నారట ఆయనతో మనము సాన్నిహిత్యం పెంచుకోవాలి అన్నారు.

నాన్నగారు భక్తురాలైన ఝాన్సీగారి ద్వారా నాన్నగారు మా జీవితంలోకి ప్రవేశించారు. ఝాన్సీగారు నాకు క్యాసెట్లు, పుస్తకాలు ఇచ్చి, నాన్నగారు వచ్చినప్పుడు చెబుతాను దర్శనం చేసుకోవచ్చని చెప్పారు. నాన్నగారు హైదరాబాద్ వచ్చినప్పుడు నన్ను తీసుకువెళ్ళి, ఈమెకు ఈ మధ్యనే భర్త చనిపోయారు అని చెప్పారు. అప్పుడు నాన్నగారు ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయా? అని అడిగితే అందరి ముందు చెప్పలేక లేవు అన్నాను. 'అలాగా!' అన్నారు. నాన్నగారిని చూడటం మొదటిసారే అయినప్పటికీ, నాన్నగారు 'అలాగా' అనే సరికి "నీకు ఆర్థిక ఇబ్బందులు ఏమీ ఉండవు" అని నన్ను ఆశీర్వదించినట్టు అనిపించింది. సాధనకి సంబంధించి నాకున్న సందేహాలు అడిగితే, సమాధానం చెప్పి 'నువ్వు తరిస్తావు' అని ఆశీర్వదించారు. ఆధ్యాత్మిక కేంద్రాలు చుట్టూ తిరగడం నా లక్ష్యం కాదు, నేను తరించటమే నా జీవిత లక్ష్యం అని అవగతమైంది. నాకేమి కావాలో నాకంటే ఎక్కువ ఈయనకే తెలిసింది కాబట్టి 'నాన్నగారే నా భౌతిక గురువు' అని ఆరోజు అర్థమయ్యింది. తరువాత మాబాబు, పాప అరుణాచలంలో మొదటిసారి నాన్నగారి దర్శనం చేసుకున్నారు.

ఉద్యోగం వలన అవకాశం ఉన్నప్పుడు మాత్రమే సోమవారం ఎస్‌ఆర్ నగర్‌లో సత్సంగానికి వెళ్లే దాన్ని. ఒకసారి ఆఫీసులో పర్మిషన్ తీసుకుని ఉదయాన్నే నాన్నగారి

దగ్గరకు వచ్చాను. నాన్నగారి ప్రవచనం అద్భుతంగా అనిపించింది. కానీ సమయం అవ్వటం వలన ప్రవచనం వదిలి వెళ్ళవలసి వస్తోంది, ఆఫీసు మరియు పిల్లల బాధ్యతలు వలన అందరిలా నాకు నాన్నగారి దగ్గరకు రావటం కుదరటం లేదు; అంత అద్భుతమైన సబ్జెక్ట్ వినటానికి అవకాశం లేని జన్మకదా! అని దుఃఖిస్తూ నిలబడ్డాను. అప్పుడు నాన్నగారు 'వారం రోజులు నీతో ఉండే గురువుని నువ్వు ఏమి పట్టుకుంటావు? హృదయంలో నిరంతరం ఉండే గురువుని పట్టుకో అని చెప్పారు'. ఆ వాక్యం నా హృదయానికి హత్తుకొని దుఃఖం అంతా ఆనందంగా మారిపోయింది.

తరువాత నాకు అనారోగ్యం వచ్చి, పిల్లలిద్దరూ ఉద్యోగాల్లో స్థిరపడ్డారని, ఉద్యోగం మానేశాను. అదే సమయంలో నాన్నగారు తరచూ హైదరాబాదు నా కోసమే వస్తున్నట్టు వచ్చి, పదిరోజులు ఉండేవారు. ఉదయాన్నే వచ్చేసి, సాయంత్రం వరకు ఉండేదాన్ని. మా పిల్లలు నాన్నగారిపై ఇష్టంతో వెళ్లమనేవారు. సోమవారం సత్సంగానికి కూడా క్రమం తప్పకుండా వెళ్ళటం వలన నాన్నగారి వాక్యాలు విలువ అర్థమయ్యి, ప్రతిరోజు ప్రవచనాలు వినేదాన్ని. మనకు అవసరమైనప్పుడు గురువు వాక్యరూపంలో వచ్చి అనుగ్రహిస్తాడు అనిపించింది. నెమ్మదిగా నాన్నగారి వాక్యాన్ని ఆచరణలోపెట్టి, నిత్యజీవితంలో అనుసంధానం చేసుకొని జీవించటం మొదలయ్యింది. ఒకసారి True Love గురించి రామకృష్ణుడిని ఉదహరించి చెబుతూ, అనుగ్రహం వర్షం కురిపించేసారు. అప్పుడు నా మనసు

**మహాత్ములు చెప్పిన మాటలు శ్రవణం చెయ్యండి, సత్పురుషుల సహవాసం చేయండి, ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండండి, జపం చేయండి, ధ్యానం చేయండి, ఇవన్నీ సాధనకు అవసరమే, కానీ వీటి అన్నింటికంటే భగవదనుగ్రహం ముఖ్యం.**



అంతర్ముఖమయ్యి, నాన్నగారి అనుగ్రహ వర్షంలో తడిసిపోయింది. నాన్నగారు లోపలికి వెళ్ళిపోయినా నేను కళ్ళు తెరవలేక పోయాను. ఆరోజు నాన్నగారు అంటే ఏమిటో నాకు అనుభవంలోకి వచ్చింది.

నాన్నగారు ప్రవచనం వినేముందు ప్రతిరోజూ విష్ణుసహస్రనామాలు వినేదాన్ని. అందులో 'శ్రీరామ రామ రామేతి... మనోరమే' అనే శ్లోకం మూడుసార్లు చదవటానికి 90 సెకన్లు పడుతుంది. నాన్నగారు మనల్ని చచ్చిపోయినట్టు జీవించమన్నారు కదా అని ఆ 90 సెకన్లు అలా ఉండటానికి ప్రయత్నించేదాన్ని. కానీ, ఆ సమయంలోనే ఎక్కువ పరీక్షలు పెట్టేవారు. మొదట్లో రియాక్ట్ అయ్యేదాన్ని. కానీ చనిపోయిన వాడికి రియాక్షన్ ఉండదు కదా! అని బాహ్యసంఘటనలకు రియాక్ట్ అవ్వకుండా అభ్యాసం చేయించారు. లోపల తలంపులు మాత్రం నిరవధికంగా వచ్చేవి. తలంపులు తగ్గి కేవలం 'నామంతోనే ఏకాగ్రంగా తాదాప్యం పొందటానికి రెండు సంవత్సరాలు పట్టింది. అలా నాన్నగారు వాక్యంలో నన్ను జీవించేటట్లు చేశారు.

ఒకసారి నాన్నగారు, హోలీ కంపెనీలో మైనస్ పాయింట్ ఏమిటంటే, విడిపోయే టప్పుడు దుఃఖం వస్తుంది అన్నారు. నాన్నగారు దేహం జిన్నూరు వెళ్ళిపోయినా, హృదయంలో ఉన్న గురువుని పట్టుకుందాము అనుకున్నాను. కానీ నాన్నగారు హైదరాబాదు నుంచి వెళ్ళిపోయే సమయానికి, రేపటినుండి దర్శనాలు ఉండవు అనే తలంపుతో దుఃఖం వచ్చేసింది. మరొకవైపు హృదయంలో ఉన్న గురువుని పట్టుకుంటాను అన్నావు కదా! అని నాన్నగారు లోపల నుండి స్ఫురింప చేస్తున్నారు. నువ్వు హృదయంలో ఉన్న గురువుని పట్టుకోగలవా? అని గట్టిగా అడిగినట్లు అనిపించింది. నాన్నగారు ట్రైను గుమ్మం దగ్గర కళ్ళు మూసుకుని నిలబడ్డారు, నాకు కూడా కళ్ళు మూసుకో అని హృదయంలో నుండి స్ఫురింపచేసి, ఒక్క నిమిషం మనస్సును అంతర్ముఖం చేశారు. అప్పుడు పూర్తిగా దుఃఖం నశించి, మన తెలివితేటలతో, సబ్జెక్టు జ్ఞాపకాలతో దుఃఖం ఆగదు, గురువు దయతో మాత్రమే దుఃఖం ఆగుతుంది అని అర్థమయ్యింది. అప్పటి నుండి మనసు శరణాగతిచెందటం మొదలుపెట్టింది.

గురువు దయవలన ఏ సమయానికి ఏ వాక్యం అవసరమో, అది స్ఫురణకు వచ్చేది. ఆ వాక్యాన్ని ఆచరించే శక్తి కూడా గురువే ఇచ్చేవారు. ఆచరించిన తరువాత దానికి ఫలితంగా శాంతియుత పరిష్కారం లభించేది. అలా 'నెమ్మదిగా నాన్నగారు శక్తిని, ప్రేమని నా మనసు ఎంజాయ్ చెయ్యడం మొదలు పెట్టింది'.

మా అమ్మాయి వివాహమయ్యాక బెంగగా ఉండేది. నాకు ఇంత మమకారం ఉందా అని నాకే ఆశ్చర్యం వేస్తూ ఉండేది. నాన్నగారు హైదరాబాద్ వచ్చినప్పుడు 'పాప మీద మమకారంతో దుఃఖం వచ్చేస్తోంది, నన్ను మమకారం నుంచి విడుదల చేయండి' అని అడిగేసాను. రెండు చేతులు పైకి పెట్టి ఆశీర్వదించి, అలాగే అన్నట్టుగా సంకేతం ఇచ్చారు". ఇంటికి వచ్చాక దుఃఖం ఎక్కువైపోయింది. ఇలా ఏడిపిస్తూ ఆ బలహీనతలో నుండి విడుదల చేస్తున్నారు అనే స్ఫురణని కూడా కలిగించారు. వారం రోజులకి నాన్నగారు జిన్నూరు వెళ్ళిపోయారు. ఆ తరువాత నాకు కన్నీళ్ళు రాలేదు. అప్పుడు నాన్నగారు మమకారపు దుఃఖం నుండి నన్ను విడుదల చేసారని అనుభవంలో తెలిసింది. అప్పటి నుండి నాలో బలహీనతలని చూసుకొని నాన్నగారిని విడుదల చేయమని అడగేదాన్ని అలా 'ప్రార్థనే మన సాధన' అని అర్థమయింది. అక్కడ నుండి వాలుగాలిలో సైకిల్ తొక్కినట్టు అయింది. రాగం, ద్వేషం, భయం, మమకారం ఇంకా ఏది ఉంటే అది చూసుకొని ప్రార్థించేదాన్ని.

మా బాబుకి దుబాయిలో జాబ్ వచ్చాక, అమ్మా! ఇప్పుడు నీకు ఏకాంతంగా ఉండటానికి అవకాశం వచ్చింది. కాలాన్ని సద్వినియోగం చేసుకో, సత్సంగాలకు వెళ్ళు, కాఫీ దొరకలేదని ఎండ్రిన్ తాగము కదా! సత్సంగం దొరకకపోతే లౌకికంలోకి వెళ్ళకు, భగవంతుడు కాలరూపంలో ఉన్నాడు, అని నాన్నగారు వేలుపెట్టి నన్ను చూపించి చెప్పారు. అప్పుడు లోపలనుండి నా ప్రయత్నం లేకుండానే కాలాన్ని సద్వినియోగం చేసుకునేలా అనుగ్రహించు తండ్రీ! నా ప్రయత్నంతోనే అవ్వదు, నీ అనుగ్రహంతోనే అవ్వాలి అని ప్రార్థన వచ్చింది.

నాన్నగారు చెప్పిన సబ్జెక్టు రాస్తే, ఎవరైనా భక్తులు మీరు రాసినది ఒకసారి చదవమని అడిగేవారు, అలా సబ్జెక్ట్ నాకు మననం అయిపోయేది. మెల్లగా నాకు తెలియకుండానే నాన్నగారు టీచింగ్‌లో ట్రైనింగ్ ఇచ్చారు. రోజూ ఉదయాన్నే ఈరోజు ఏమి సాధన చేసుకోమంటారు అని మనసులో నాన్నగారిని అడిగి, ఉపన్యాసం పెట్టుకునేదాన్ని. 'నువ్వు గతంలోకి వెళ్ళి, మనసుకు పుండు చేసుకోకు' అని ఒకరోజు; 'నిన్ను నువ్వు పొగుడుకోకు'; 'ఎదుటి వాళ్లతో పోల్చుకోకు'; ఎదుటి వారిని విమర్శించకు, అందరిలో ఈశ్వరుడిని చూడు', అలా రోజుకొక వాక్యం పట్టుకొని, ప్రాక్టీస్ చేసేదాన్ని. గతంలోకి వెళ్ళవద్దు అన్నారు కదా, గతం గుర్తుకొస్తోందేమిటి, అని విచారణ చేసుకుని, అక్షరమణమాల, ఉపదేశసారము, నాన్నగారు నామము చేసుకుంటూ మనసుని నిరోధించేదాన్ని. కాసేపటకి బయటకి వెళ్ళిపోయేది, మళ్లీ నాన్నగారు గుర్తుకు వచ్చేవారు, మళ్లీ సాధన చేసేదాన్ని అలా రోజులో పదిసార్లు ఆ వాక్యం గుర్తుకొచ్చేది, మరుసటిరోజు ఇంకొక వాక్యం, ఆ రోజంతా ఆ వాక్యం మీదే సాధన. నాన్నగారిని 'అవినయం రాకుండా ఆశీర్వదించండి, మీరు మరుపు రాకుండా ఆశీర్వదించండి, పొగడ్తలకి వికారం రాకుండా ఆశీర్వదించండి' అలా నాలో బలహీనతలు అన్నిటినీ చూసుకొని ప్రార్థించేదాన్ని. క్రమంగా నాలో మార్పు తీసుకొచ్చి, ఈ సత్సంగాలు ఆయనే చెప్పిస్తున్నారు, అది కేవలం ఆయన అనుగ్రహం మాత్రమే.

నేను మొదట్లో నాన్నగారు నావైపు చూడాలి, పలకరించాలని కోరుకునేదాన్ని. ఇంతలో నాన్నగారు ఇంట్లోవారిని పలకరించడం అవసరమా! అని ఎవరితోనో అంటున్నారు. నాన్నగారితో మాట్లాడవలసిన పనిలేదు, హృదయంలో చెప్పేసుకుంటే సరిపోయేది. నాన్నగారి దయ నాకు మౌనంగానే తెలిసేది.

ఒకసారి ఒక భక్తురాలు భర్త చనిపోయారు అని వచ్చారు. అయ్యో! నా భర్త చనిపోయే సమయానికి నాన్నగారు దగ్గర వుంటే ఆశీర్వదించేవారు, ఆ జీవుడు పవిత్రులయ్యేవారు కదా! అనుకున్నాను. వెంటనే, నాన్నగారు అమ్మా! డాక్టరు గారు ఎప్పుడు చనిపోయారు అనడిగారు. అంటే మనమనసులో ఉన్నది ఆయనకు తెలిసిపోతుంది కదా,

వెనక్కి తిరిగి చూసుకుంటే మన జీవితంలో నాన్నగారే ఉంటారు మనం ఉండము. ఎప్పుడైతే, పిల్లల్ని కొండకు అప్పచెప్పానో అప్పటినుండి నాన్నగారే పిల్లల్ని చూసుకున్నారు. 'రూపుదాల్చిన గిరి మన నాన్నగారు'.

నాన్నగారిది సులభ మార్గం. కానీ మనం ప్రయత్నం సిన్సియరుగా చేయాలి. ఎక్కడ ఫెయిల్ అవుతున్నామో చూసుకొని అక్కడ ప్రయత్నం చేస్తూ ఉండాలి. గురువు ఆ ప్రయత్నమే చూస్తాడు. 'గురువుకి నీ జీవితం అంకితం చెయ్యి, గురువు యందు విశ్వాసం చెదరకుండా చూసుకో' అనే వాక్యాలు నాకు చాలా ఇష్టమైనవి. అంటే గురువు చేయమన్న పని చేసి, వద్దన్న పని చెయ్యకూడదు. అలా జీవిస్తూ, తండ్రీ! నువ్వు చెప్పినట్టు జీవించే విధంగా అనుగ్రహించు అని ప్రార్థిస్తుండాలి. నెమ్మదిగా ప్రయాణం చేసినా, గమ్యం మాత్రం మరిచి పోకూడదు. గురువు మీద విశ్వాసం చెదరకుండా చూసుకుంటూ, నిరంతరం గురుస్మరణలో ఉంటే, నీ కర్తవ్యకర్మలు నీవు చెయ్యకూడదు అనుకున్నా, చెయ్యకుండా ఉండలేవు. అలా చేస్తూ ఉంటే ఆయన దయ మనపై ఉండి తప్పనిసరిగా హృదయసుఖాన్ని పొందుతాము.

నాన్నగారి ప్రేమ, సూర్యుడి వెలుగులా విశ్వప్రేమ. మనం నాన్నగారిలా కాకపోయినా, కిరసనాయిలు దీపంలా ఒక నలుగురిని ప్రేమిద్దాము. అలా చిన్న ప్రయత్నం చేసి, ఆ ప్రేమించే శక్తిని ఇమ్మని గురువుని ప్రార్థిద్దాము. అలా చేస్తుంటే, తప్పనిసరిగా గురువు తన holdలోకి తీసుకుంటాడు. మనము గురువు గర్భంలోనే జీవిస్తున్నాము అనటంలో ఎటువంటి సందేహము లేదు. నాన్నగారు చేయవలసిన పని ఏమీ లేకపోయినా, మనకోసం బోధిస్తూ, పనిచేసి చూపించారు. కాబట్టి ఆయన జీవితమే బోధ అయ్యింది. ఆ బోధే మనకి ఆదర్శం. నాన్నగారు సామాన్య గురువు కాదు, మన అందరికీ జ్ఞానం వస్తుంది అని 'అభయమిస్తూ' అనేక రకాలుగా ఆశీర్వదించారు కాబట్టి మనందరం తప్పనిసరిగా తరించి తీరుతాము.

ఒక ఆస్ట్రేలియా భక్తుడు ' మీరు నన్ను ఏ విధంగా ప్రేమించారో జ్ఞాపకం తెచ్చుకుంటే,

ఆ ప్రేమలో నా అహంకారం కరిగిపోతోంది' అని ఉత్తరంలో రాశాడట. అలాగ నాన్నగారి ప్రేమను జ్ఞాపకం తెచ్చుకుని ఆయనకు కృతజ్ఞతలు చెప్పుకుందాము. గురువు జీవించి ఆదర్శంగా చూపించిన రీతిలో యధాతథంగా మనం జీవించటానికి చిన్న ప్రయత్నం చేసి శరణాగతి చేయాలి. నన్ను అలా జీవింపచేయి తండ్రీ! అని ప్రార్థించాలి. అప్పుడు మన గురువుకి కృతజ్ఞత చెప్పుకున్నవాళ్ళం అవుతాము. గురువు ఏ చైతన్యస్థాయిలోఉన్నాడో, ఆ చైతన్యస్థాయికి మనల్ని తీసుకువెళ్ళటానికి సిద్ధంగానే ఉన్నాడు. మనసు నశించేవరకూ ప్రయత్నం విడిచిపెట్టకూడదు. మనసు నశించిన తరువాత ఆ దేహం ద్వారా జరగవలసిన పనులు జరుగుతూ ఉంటాయి.

**శ్రీమతి రాజేశ్వరిగారు శరీరం విడిచి నాన్నగారి దగ్గరికి వెళ్ళిపోయేముందు చెప్పిన "తుదిపలుకులు":**

"నాన్నగారి అనుగ్రహంతో మనసు చాలా బాగుంది; నాన్నగారిలో ఐక్యం అవ్వటానికి ప్రయత్నం చేస్తోంది. ఈరోజు ఉదయం క్యాసెట్ పెట్టుకుంటే మోక్షం మీ అందరికీ ఇచ్చేస్తాను సందేహపడకండి అని చెప్పారు. ఎవరూ కంగారు పడవద్దు. దేహం నేను కాదు, మనసు నేను కాదు, మన అందరం ఆత్మస్వరూపులము. అదిగా నిలిచి ఉందాము... సబ్జెక్టుకు దూరం అవ్వకండి. సబ్జెక్టే గురువు. గిరిరూపమో, గురురూపమో శ్రీనాన్నపాదమే మాకు శరణ్యము."



**మీరు ఎవరిని ఉపాసించినప్పటికీ, ఎవరిని ధ్యానం చేసినప్పటికీ,సాధనలు పేరు మీద ఏ వ్రతాలు చేస్తున్నప్పటికీ, అంతఃకరణంలో దోషాలు రాలిపోయేవరకు, ప్రతీ జన్మలో కూడా సంసారం వెంటాడుతూ ఉంటుంది. మనసులో కల్మషం ఉన్నంత కాలం వాడు జ్ఞానానికి అర్హుడు కాదు.**



ఓం శ్రీ నాన్నపరమాత్మనే నమః

## సద్గురు **శ్రీ నాన్నగారి జయంతి** సందర్భంగా

## దిll 23-09-2026 బుధవారం

## జిన్నూరు శ్రీ రమణ క్షేత్రంలో జరుగు కార్యక్రమములు

| | |
|---|---|
| ఉll గంll 6-00 లకు | **పారాయణం** |
| ఉll గంll 6-45 నిllలకు | **సర్ప, నెమలి వాహనములపై గిరిప్రదక్షిణ** |
| ఉll గంll 7-00 లకు | **అల్పాహారం** |
| ఉll గంll 7-15 నిllలకు | **పూజా కార్యక్రమములు** |
| ఉll గంll 9-00 లకు | **సత్సంగం** |
| ఉll గంll 11-00 లకు | **అన్నప్రసాదం** |

భక్తులు అందరకీ ఆహ్వానం

– శ్రీ రమణ క్షేత్రం జిన్నూరు

# సద్గురు జయంతి

దిll 23-09-2026న సద్గురు శ్రీనాన్నగారి జయంతిని జరుపుకోబోతున్నాం. సద్గురువు శ్రీనాన్నగారు భౌతికంగా మన మధ్య లేకున్నా వారి ఉనికిని ప్రస్ఫుటంగా అనుభవిస్తున్నాం! సకల ప్రాణకోటి హృదయాంతరాళాలలో నివసించే నిత్యజ్యోతి సద్గురు శ్రీనాన్నగారు. ఆనాడు సద్గురుని సమక్షంలో మనమందరము అనుభవించిన అలౌకిక ఆనందము అంతా గతమేనా? ఎన్నటికీ కానేకాదు. వాస్తవంగా మానవుడు తన్ను తాను తెలుసుకున్నట్లయితే సద్గురువు స్వరూపంగానే ఉన్నారనే సత్యం అవగతమవుతుంది. అనుగ్రహము, దయతో భక్తులను చూచే వారి చూపులో తల్లి తన బిడ్డలను చూచే చూపుగానే ఉండేది. ఆయన తన జీవితాన్ని జ్ఞానబోధ కోసము, మానవసేవకోసము, మిత్రునివలె మార్గదర్శనం చేయడం కోసము, వినియోగించారు. ఆత్మ తత్త్వాన్ని చాలా సులువైన పద్ధతిలో బోధించి దానిని అనుభవించి, జీవించి చూపించారు. వారు భక్తుల అవసరాలను తీర్చేవారు ఎందుకంటే? వారిలో జ్ఞాన జిజ్ఞాస కలిగించేందుకే. పసిబిడ్డ అవసరాలను తీర్చే తండ్రిమాదిరిగా భక్తుల అవసరాలను తీర్చి ఆదుకునేవారు. జిన్నూరు గ్రామంలో కొలువుతీరి, అనేక గ్రామాలను పర్యటిస్తూ, తన చుట్టూ ఉన్న ప్రపంచ కోలాహలం మధ్య నిశ్చలుడై, ఆత్మ సంస్థితుడై నిలిచారు. ఆయన తన జీవితకాలంలో రమణమార్గానికి మార్గదర్శకులై వెలుగును ప్రసాదించారు. ఆయన జీవితవిధానము మరియు బోధ ద్వారా మనము గ్రహించవలసింది ఏమంటే? మనబోటి సాధకులకు ప్రతీ అడుగులోనూ సద్గురుని యొక్క కరుణ, అనుగ్రహము, ఆశీస్సులు అవసరమని అవగతమవుతుంది. సద్గురుని అనుగ్రహము నిత్యము, శాశ్వతము. ఆయన అనుగ్రహము వల్లనే విజ్ఞులైన వారికి తన్ను తాను తెలుసుకోవాలనే కోరిక కలుగుతుంది. అటువంటి కోరిక దేహాత్మబుద్ధి అనే గొప్ప ప్రమాదము నుండి మనలను రక్షిస్తుంది. సద్గురు శ్రీనాన్నగారిని ఆయన జీవితకాలంలో చూడని వారు కూడా ఆయనబోధనలు, ప్రేమతత్త్వాన్ని గురించి తెలుసుకుని, ఆకర్షితులై జిన్నూరు రమణక్షేత్రాన్ని దర్శించి, సంతృప్తిని పొంది, మరల మరల దర్శిస్తూనే ఉన్నారు. సంసార చక్రమునుండి విడుదల పొందే మార్గము చూపి, మృత్యుభయమును నివారించి, స్వరూప అమృతస్థితిలోకి మేల్కొలిపే రూపుదాల్చిన చైతన్యమే గురువు. మనము కర్తృత్వ బుద్ధిని విడిచిపెట్టకుండా, మనస్సు నశించకుండా, స్వస్వరూపానుభూతి కలుగదు. సద్గురువు అంటే విముక్తి ప్రదాత. ఆయన ప్రభావం మానవాళిపై అత్యంత బలీయంగా ఉంటుంది. తనను ఆశ్రయించిన వారి అశాంతిని, దుఃఖాన్ని తొలగించి స్వరూప అమృత స్థితిలోకి మేల్కొలిపే సద్గురువు లభించడమే నిజంగా ఈశ్వర కృప. అట్టి సద్గురువు శ్రీనాన్నగారి సాంగత్యములో మనము జ్ఞాన ఫలాన్ని అందుకున్నాము. మనందరికీ సద్గురువు శ్రీనాన్నగారు ఒక మూర్తీభవించిన తండ్రి, అట్లే మూర్తీభవించిన ప్రేమతత్త్వం.

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**